సాక్షి
సిద్దిపేట
మంగళవారం । 31 । డిసెంబర్ । 2024



ఆమె చేతికి స్టీరింగ్

గ్రామీణ ప్రాంతాల్లోని మహిళా సంఘాలకు ప్రభుత్వం ఎలక్ట్రిక్ వాహనాలను అందించనుంది. వివరాలు 8లో ▸



పంచాయతీ బోరు..

కట్కూర్‌లో ప్రభుత్వ నిధులతో వేయించిన బోరును కొందరు తమ సొంత పొలాలకు నీరును పారిస్తున్నారు. వివరాలు 8లో ▸



పొద్దుతిరుగుడుకు కేరాఫ్..

అక్కన్నపేట మండలం కట్కూర్ గ్రామం పొద్దు తిరుగుడు పంటకు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తోంది. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

నాణ్యమైన వైద్య సేవలు అందించండి

డీఎంహెచ్‌ఓ పల్వన్‌కుమార్



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ

సిద్దిపేటకమాన్: ప్రైవేటు ఆస్పత్రుల్లోనూ నాణ్యమైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ పల్వన్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లోని వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ చందర్, సెక్రటరీ డాక్టర్ గణేశ్, ఇతర వైద్యులు, ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యం, వైద్యాధికారులతో డీఎంహెచ్‌ఓ సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆస్పత్రుల్లో సేవలకు సంబంధించిన సూచిక బోర్డును తప్పక ఏర్పాటు చేయాలన్నారు. నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలన్నారు. వివిధ ఆరోగ్య సేవలకు సంబంధించిన సమాచారాన్ని ప్రతినెలా హెచ్‌ఐఎంఎస్ పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్లు శ్రీనివాస్, సతీష్, రవికాంత్, వీవీరావు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతకు అందరూ సహకరించాలి

మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి



తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజమౌళి

గజ్వేల్: తడి, పొడి చెత్త సేకరణ వేర్వేరుగా చేపట్టి స్వచ్ఛతకు సహకరించాలని మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి అన్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని 5, 17 వార్డుల్లో తడి, పొడి చెత్త సేకరణపై ఆవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశుభ్రత కోసం వారంలో రెండు గంటల పాటు శ్రమదానం చేయాలని కోరారు. చెత్తను తడి, పొడిగా వేరు చేసిన తర్వాతే స్వచ్ఛ వాహనాలకు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య, మున్సిపల్ కౌన్సిలర్లు లక్ష్మీకిషన్‌రెడ్డి, శీర్ల శ్యామల, శానటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

చేనేతకు చేయూత నివ్వండి

- కార్మికుల సంఘం రాష్ట్ర నాయకుడు లక్ష్మీనారాయణ
- పట్టణంలో భారీ ర్యాలీ



గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న చేనేత కార్మికులు, నాయకులు

సిద్దిపేటజోన్: చేనేత కార్మికుల సంక్షేమంపై ప్రభుత్వం దృష్టి సారించాలని రాష్ట్ర పద్మశాలి, చేనేత కార్మికుల సంఘం నాయకుడు లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్య్రం సిద్ధించి 70 ఏళ్లు దాటినా చేనేత కార్మికుల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. దినసరి కూలీగా బతుకు సాగిస్తున్న చేనేత కార్మికులకు ప్రభుత్వం అండగా ఉండాలని కోరారు. పద్మశాలి చేనేత కార్మికులకు రుణాలు మంజూరు చేయాలని. అర్హులైన వారికి అంత్యోదయ కార్డులను ఇవ్వాలని కోరారు. 50 ఏళ్లు దాటిన చేనేత కార్మికులకు పింఛన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో మగ్గం నేస్తున్న చేనేత కార్మికుడి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ పెట్టి చేనేత పరిశ్రమను ఆదుకోవాలని కోరారు. ఈ ర్యాలీలో పట్టణ చేనేత పద్మశాలి సంఘం ప్రతినిధులు సత్యనారాయణ, దుర్గేష్, రాంచంద్రం తదితరులు పాల్గొన్నారు.

'డైట్' వెబ్‌ఆప్షన్ల నమోదుకు అవకాశం

హవేళిఘణాపూర్(మెదక్): డైట్‌సెట్‌- 2024 మూడోదశకు సంబంధించిన వెబ్ ఆప్షన్లను జనవరి 2 నుంచి 4వ తేదీలోపు మీసేవ కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని హవేళిఘణాపూర్ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రమేశ్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

హద్దు మీరొద్దు.. గీత దాటొద్దు

వినోదం విషాదం కావొద్దు

- న్యూ ఇయర్ వేడుకల్లో నిబంధనలు తప్పొద్దు
- ప్రజలకు ఇబ్బందులు తేవొద్దు
- మద్యం తాగి వాహనాలు నడపొద్దు





'సాక్షి' ఫోన్ ఇన్‌లో సీపీ డాక్టర్ అనురాధ

'నూతన సంవత్సర వేడుకలు శాంతియుతంగా జరుపుకోవాలి. మద్యం తాగి వాహనాలు నడిపినా.. ప్రజలకు ఇబ్బంది కలిగేలా న్యూసెన్స్ చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. డీజేలకు అనుమతి లేదు. కమిషనరేట్ పరిధిలో మంగళవారం రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం. వాహనాలు తనిఖీ చేస్తాం. డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తాం. వేడుకల పేరుతో అర్ధరాత్రి వేళ యువత బైక్‌లపై ర్యాష్ డ్రైవింగ్, ట్రిబుల్ రైడింగ్ చేసినా, బహిరంగంగా మద్యం తాగినా చర్యలు తీసుకుంటాం. మైనర్లకు వాహనాలు ఇస్తే వారి తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తాం' అని సీపీ డాక్టర్ అనురాధ అన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా పోలీసు శాఖ చేపట్టనున్న చర్యలపై 'సాక్షి' సోమవారం నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. సిద్దిపేట పట్టణంతో పాటు జిల్లా పరిధిలోని పలువురు నేరుగా సీపీతో ఫోన్‌లో మాట్లాడి సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

– సిద్దిపేటకమాన్

ప్రశ్న: నూతన సంవత్సర వేడుకల పేరుతో కొంత మంది మద్యం తాగి వాహనాలను ర్యాష్‌గా నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో పోలీసు శాఖ ఎలాంటి చర్యలు తీసుకుంటోంది?

-వేణుగోపాల్‌రెడ్డి, హుస్నాబాద్, యాదగిరి మజ్జిపల్లి

సీపీ: కమిషనరేట్ పరిధిలో డిసెంబర్ 31న రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పెట్రోలింగ్, వాహనాల తనిఖీ నిర్వహిస్తాం. మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేస్తాం. ప్రశాంతంగా వేడుకలు జరుపుకొనేలా విజబుల్ పోలిసింగ్‌తో పోలీసుశాఖ అలర్ట్‌గా ఉంటుంది.

ప్రశ్న: పిల్లలు, యువత గంజాయి, డ్రగ్స్‌కు అలవాటు పడుతున్నారు. వీరిపై మీరు తీసుకునే చర్యలేవీ?

-స్వామి, దుబ్బాక

సీపీ: డ్రగ్స్ టెస్టింగ్ కిట్స్‌తో పరీక్షలు నిర్వహించి ఫలితాల ఆధారంగా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నాం. గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల నియంత్రణకు పోలీసు శాఖ కృషి చేస్తోంది. అంతేకాకుండా నార్కోటిక్స్ స్పెషల్ డాగ్స్‌తో తనిఖీలు నిర్వహించనున్నాం.

ప్రశ్న: మద్యం దుకాణాలు అర్ధరాత్రి వరకు తెరిచి ఉంటాయని అంటున్నారు.. షాప్‌లు ముందుగానే మూసివేసే అవకాశం ఉందా?

– భువనగిరి మహేందర్, బెజ్జంకి

సీపీ: మద్యం దుకాణాలకు మంగళవారం రాత్రి 12 గంటల వరకు, బార్ అండ్ రెస్టారెంట్లకు ఒంటి గంట వరకు ఎక్సైజ్ శాఖ అనుమతులు ఇచ్చింది. అది ఎక్సైజ్ శాఖ పరిధిలోనిది. కానీ వేడుకల పేరుతో బహిరంగంగా మద్యం తాగినా, తాగి వాహనాలను నడిపినా చర్యలు తప్పవు.

ప్రశ్న: యువత చెడు అలవాట్ల బారీన పడుతున్నారు. సిగరెట్లలో డ్రగ్స్ అందుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీనిపై ఎలాంటి అవగాహన కల్పిస్తున్నారు?

– కమాలకర్‌రెడ్డి, మిడుదొడ్డి

సీపీ: జిల్లాలోని ప్రతి పాఠశాల, కళాశాలల్లో యాంటి డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేసి పిల్లలకు అవగాహన కల్పిస్తున్నాం. కమిటీలో పోలీసు అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు సభ్యులుగా ఉంటారు. ఇన్‌స్టాంట్ డ్రగ్ కిట్‌లతో పరీక్షలు నిర్వహించి చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న: రోడ్లపై కేక్ కట్ చేసి, హంగామా చేసి, న్యూసెన్స్ చేసే వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

– శంకర్‌బాబు, రవిందర్‌గౌడ్, హుస్నాబాద్

సీపీ: వేడుకల పేరుతో రోడ్లపై కేక్ కట్ చేసినా, డీజేలు పెట్టినా, మద్యం తాగి ప్రజలకు ఇబ్బంది కలిగే విధంగా న్యూసెన్స్ చేసినా చట్ట పరమైన చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: మైనర్లు సైతం రాత్రి వేళ రోడ్లపై తిరుగుతున్నారు. కొందరు ప్రమాదాల బారిన పడుతున్నారు. వీరి నియంత్రణకు చర్యలు?

-పొన్నాల బాబు, నారాయణరావుపేట

సీపీ: వేడుకల పేరుతో మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే వారి తల్లిదండ్రులపైనా కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: కాలనీల్లో డీజేలు పెట్టడం వల్ల వృద్ధులు, హార్ట్ పేషెంట్లు ఇబ్బందులు పడే అవకాశం ఉంది. డీజేలకు అనుమతులు ఇస్తే ఇబ్బంది అవుతుంది.

– రాజేశం, బెజ్జంకి

సీపీ: డీజేలకు ఎలాంటి అనుమతులు లేవు. వేడుకల పేరుతో ప్రజలకు ఇబ్బంది కలిగేస్తే చర్యలు తప్పవు. గ్రామాల్లో సైతం పోలీసు సిబ్బంది పెట్రోలింగ్ నిర్వహిస్తారు. ఏదైనా సమస్య ఉంటే డయల్ 100కు కాల్ చేసి తెలపాలి.

ప్రశ్న: సమీప ఫంక్షన్‌హాళ్ల నుంచి వచ్చే సౌండ్ వల్ల కాలనీ వాళ్లు ఇబ్బంది పడుతున్నారు. అలాగే సీసీ కెమరాలు పనిచేయడం లేదు. చర్యలు తీసుకోండి?

– నాగరాజు, ప్రియదర్శినినగర్, సిద్దిపేట

సీపీ: సీసీ కెమరాలను పరిశీలించి పనిచేయని వాటిని రిపేర్ చేయించడం జరుగుతుంది. ఫంక్షన్‌హాళ్ల యజమానులకు ఆదేశాలిస్తాం.

ప్రశ్న: వేడుకల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా, మహిళల రక్షణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

– వెంకటేశ్‌గౌడ్, తిమ్మారెడ్డిపల్లి, మంజుల దుబ్బాక

సీపీ: ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు సిబ్బంది రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తుంది. వేడుకలు విషాదంగా మారకూడదు. ప్రశాంత వాతావరణంలో సంతోషంగా జరుపుకోవాలి.

ప్రశ్న: న్యూ ఇయర్ వేడుకల కోసం సౌండ్ వినియోగం కోసం అనుమతులు ఏమైనా తీసుకోవాలా?

-కుమార్, గాంధీనగర్ హుస్నాబాద్

సీపీ: వేడుకల పేరిట న్యూసెన్స్ చేసి, ప్రజలకు ఇబ్బంది కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. డీజేలకు ఎలాంటి అనుమతి లేదు. డే టైమ్‌లో 55 డిసబుల్ కంటే తక్కువ, రాత్రి సమయంలో 45 డిసబుల్ కంటే తక్కువ మాత్రమే వినియోగించాలి. స్పెషల్ డ్రైవ్ చేపడతాం. మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై కేసులు నమోదు చేస్తాం.

ప్రశ్న: మద్యం తాగి రోడ్లపై న్యూసెన్స్ చేసే వారిపట్ల మీ వైఖరి.. వారికి ఏ విధంగా అవగాహన కల్పిస్తారు?

– మధు, దుబ్బాక, రాజిరెడ్డి, రాయపోల్

సీపీ: మంగళవారం రాత్రి స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం. మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తాం. ఈ విషయం ప్రజలకు తెలిసేలా పోలీసు స్టేషన్‌ల పరిధిలోని ప్రజలకు పోలీసులు అవగాహన కల్పిస్తున్నాం.



సామూహిక లక్షపుష్పార్చనలో భక్తులు

అంగరంగ వైభవం.. మూలమహోత్సవం

- లక్షపుష్పార్చన నేత్రపర్వం
- భక్తి పారవశ్యంలో వర్గల్ క్షేత్రం



సరస్వతిమాత దివ్య మంగళరూపం

వర్గల్(గజ్వేల్): సుప్రసిద్ధ వర్గల్ విద్యాసరస్వతి క్షేత్రం మూల మహోత్సవ వేడుకలతో అలరారింది. సోమవారం సరస్వతిమాత జన్మ నక్షత్రం సందర్భంగా సామూహిక లక్షపుష్పార్చన నేత్రపర్వం చేసింది. తెల్లవారుజామున ఆలయ వ్యవస్థాపక చైర్మన్ చంద్రశేఖర సిద్ధాంతి ఆధ్వర్యంలో అర్చకులు అమ్మవారి మూలవిరాట్టుకు విశేష పంచామృతాభిషేకం జరిపారు. పట్టువస్త్రాలు, ఆభరణాలు, పూల మాలలతో కమనీయంగా అలంకరించారు. ప్రత్యేక పూజలు చేశారు. మహాకలశ మండపంలో భక్తజనులు అమ్మవారి నామం స్మరిస్తూ సామూహిక లక్షపుష్పార్చన జరిపారు. వేదపండితులు యాగశాలలో చండీ హోమం, పూర్ణాహుతి నిర్వహించారు.



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

మల్లన్న స్వామికి లక్ష బిల్వార్చన

రుద్రనామస్మరణతో మారుమోగిన ఆలయం



కొమురవెల్లి(సిద్దిపేట): మేడలమ్మ, కేతమ్మ సమేత కొమురవెల్లి మల్లన్న స్వామికి సోమవారం అత్యంత వైభవంగా లక్షబిల్వార్చన, రుద్రాభిషేకం నిర్వహించారు. రుద్రనామస్మరణతో ఆలయ పరిసరాలు మారుమోగాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా వీరశైవ రుత్వికులు స్వామివారికి శాస్త్రోక్తంగా లక్ష బిల్వార్చన జరిపారు. ఆలయ తోట బావి ఆవరణలో అంగరంగ వైభవంగా నిర్వహించిన స్వామి వారి కల్యాణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమైన విషయం విదితమే. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు మల్లన్నకు సుప్రభాత సేవ, గణపతిపూజ, గౌరి పూజ, శివపుణ్యాహవాచనం, అఖండ దీపస్థాపన, పంచకలశారాధన, నవగ్రహ, దిక్పాలక, ఏకాదశరుద్ర, తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, ప్రధానార్చకులు మహదేవుని మల్లికార్జున్, పూజారులు. అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం బుకింగ్ ఆదాయం రూ.16.51లక్షలు

మల్లన్న కల్యాణం సందర్భంగా భక్తులు భారీగా తరలివచ్చి మొక్కుబడులు తీర్చుకున్న క్రమంలో రూ.16,51,520 మేర ఆదాయం సమకూరినట్లు ఆలయ వర్గాలు తెలిపాయి.

అర్జీలకు సత్వర పరిష్కారం

- కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి
- ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులు 49



దామరకుంట విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేటరూరల్: ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా వచ్చిన అర్జీలను సత్వరం పరిష్కరించే దిశగా కృషి చేయాలని కలెక్టర్ మనుచౌదరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు ఎంతో ఆశతో కలెక్టరేట్‌కు వస్తున్న క్రమంలో వారి సమస్యలు పరిష్కరించడంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ మొత్తం 49 దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, డీఆర్‌ఓ నాగరాజమ్మ, డీఆర్‌డీఓ జయదేవ్ ఆర్యా, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్ అభినందనలు

జాతీయ సైన్స్ ఫెయిర్‌కు ఎంపికైన మర్కూక్ మండలం దామరకుంటకు చెందిన విద్యార్థులు అశ్వంత్, కార్తిక్‌చారిలను కలెక్టర్ అభినందించారు. జాతీయ స్థాయిలో ప్రదర్శించే ప్రాజెక్టుల గురించి అడిగి తెలుసుకున్నారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం భోపాల్‌లో జరిగే సైన్స్ కాంగ్రెస్‌లో వీరు పాల్గొననున్నారు.

రాష్ట్ర యోగా పోటీలకు జిల్లా జట్టు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సీఎం కప్ రాష్ట్ర యోగా పోటీలకు జిల్లా జట్టు ఎంపికయ్యిందని యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తోటఅశోక్, యోగా శిక్షకులు తోటసంధ్య, పల్లె సురేష్‌లు తెలిపారు. మంగళవారం నుంచి గురువారం వరకు నగరంలోని సరూర్‌నగర్ స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో జిల్లా జట్టు పాల్గొననున్నట్లు తెలిపారు. యోగా జట్టు సోమవారం హైదరాబాద్‌కు వెళ్లినట్లు తెలిపారు. వీరితో పాటు ఫిజికల్ డైరెక్టర్లు కవిత, రాధిక ఉన్నారన్నారు.

ప్రసాదంలో నాణ్యత తప్పనిసరి

జగదేవ్‌పూర్(గజ్వేల్): కొండపోచమ్మ అమ్మవారి ప్రసాదంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని దేవాదాయశాఖ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మి అన్నారు. సోమవారం కొండపోచమ్మ ఆలయం వద్ద దేవాదాయ, ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో బహిరంగ వేలం పాట నిర్వహించారు. తిగుల్‌నర్సాపూర్‌కు చెందిన ప్రశాంత్ లడ్డూ, పులిహోర నిమిత్తం రూ.26.30 లక్షలకు వేలంలో దక్కించుకున్నారు. అలాగే సత్యనారాయణ, పోచయ్యలు రెండు దుకాణాలను రూ.88 వేలకు, పూల దండలు అమ్మకానికి అశోక్ అనే వ్యక్తి రూ.16 వేలకు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ లడ్డూ, పులిహోరలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, లేనిచో డిపాజిట్ రద్దు చేస్తామని తెలిపారు. వేలం పాట ద్వారా ఆలయానికి రూ.27. 80 లక్షలు వచ్చినట్లు తెలిపారు. జనవరి 13 నుంచి అమ్మవారి జాతర ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆలయాన్ని రంగులతో, భక్తులకు సౌకర్యాలను కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈఓ రవికుమార్, సిబ్బంది మహేందర్‌రెడ్డి, కనకయ్య, డైరెక్టర్లు నరేష్, వజ్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపండి

- వచ్చే మూడు నెలలు కీలకం
- టెన్త్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి
- తల్లిదండ్రులకు ఎమ్మెల్యే హరీశ్‌రావు ఉత్తరాలు



ఎమ్మెల్యే హరీశ్‌రావు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రానున్న మూడు నెలలు టెన్త్ విద్యార్థులకు కీలకమని, ఎమ్మెల్యే హరీశ్‌రావు తెలిపారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల తల్లిదండ్రులకు సోమవారం ఉత్తరాలు రాశారు. ఈ ఉత్తరంలో ఏం ఉందంటే.. మార్చి నెలలో జరిగే పదో తరగతి వార్షిక పరీక్షల నిమిత్తం పిల్లలను ప్రత్యేక శ్రద్ధ చూపి చదివించాలాన్నారు. ప్రణాళికాబద్ధమైన చదువు మన తలరాతనే మారుస్తుందనడానికి ఎన్నో సజీవసాక్ష్యాలు ఉన్నాయని ఉత్తరంలో పేర్కొన్నారు. వారి చదువులో ఇది అత్యంత కీలకమైన ఘట్టమన్నారు. ఇది మంచి మార్కులతో గట్టెక్కితేనే ఉన్నత చదువుల దిశగా ముందడుగు వేసే అవకాశం ఉంటుందన్నారు. ముఖ్యంగా పిల్లలను సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచండన్నారు. నాలుగేళ్లుగా మన సిద్దిపేట నియోజకవర్గంలో చదివిన పదో తరగతి విద్యార్థులంతా అత్యధిక మార్కులు సాధిస్తున్నారన్నారు. నూటికి నూరు శాతం పాసవుతున్నారు. ప్రతిష్టాత్మకమైన బాసర ట్రిపుల్ ఐటీ విద్యాసంస్థలోనూ 169 మంది సిద్దిపేట నియోజకవర్గ విద్యార్థులు గత ఏడాది సీట్లు సాధించడం గర్వకారణమన్నారు. అన్ని రంగాల్లో ఆదర్శంగా నిలిచిన మన సిద్దిపేట నియోజకవర్గం.. పదో తరగతి ఫలితాల్లో కూడా ఆదర్శంగా నిలవాలనేదే నా తాపత్రయమన్నారు. మీ పిల్లల భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉందని ఉత్తరంలో పేర్కొన్నారు.

టమాటా..

ధర ధమాల్.. కిలో రూ.5

- దిక్కుతోచని స్థితిలో రైతులు
- కూలీ డబ్బులు కూడా రావట్లేదంటూ ఆవేదన



మెట్‌పల్లిలో పండించిన టమాటా

చిన్నకోడూరు(సిద్దిపేట): నిన్నమొన్నటి వరకు మంచి ధర పలికిన టమాటా అమాంతంగా పడిపోయింది. రోజు రోజుకు పతనం కావడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. మొన్నటి వరకు కిలో 20- 30 ధర పలికగా.. నేడు మార్కెట్‌లో రూ.5 పడిపోయింది. ఆరుగాలం కష్టపడి ఆటుపోట్లు ఎదుర్కొని పండించిన పంట అమ్మితే రవాణా ఖర్చులు.. కూలీ డబ్బులు కూడా రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నకోడూరు మండలంలోని మాచాపూర్, మెట్‌పల్లి, మల్లారం, వితలాపూర్, చౌడారం, మేడిపల్లి గ్రామాల్లో సుమారు 500 ఎకరాల్లో టమాటా సాగు చేస్తున్నారు. ఎకరా టమాటా పంట సాగుకు రూ.30 వేలు ఖర్చు అవుతుంది. తెగుళ్లు సోకితే అదనంగా భారం పడుతుంది. అన్ని జాగ్రత్తలు తీసుకుని పంట పండిస్తే పంట చేతికి వచ్చాక మార్కెట్‌లో అమ్ముదామంటే కనీస మద్దతు ధర లభించడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

నెల..	టమాటా కిలో (రూ.ధర)
అక్టోబర్‌లో..	70
నవంబర్‌లో	50
డిసెంబర్‌లో	10

ఆదాయం అంతంతే..

ప్రస్తుతం మార్కెట్‌లో 20 కిలోల పెట్టే ధర రూ.100 పలుకుతోంది. ఎకరం సాగుకు రూ. 30 వేల వరకు ఖర్చు అవుతుంది. టమాటా తెంపడానికి ఒక్కో కూలీకి రోజుకు రూ. 300-400 వరకు ఇస్తున్నామని రైతులు చెబుతున్నారు. మార్కెట్‌లో అమ్మితే కూలీ, రవాణా ఖర్చు రావడం లేదు. పంటకు తెగుళ్లు రాకుండా జాగ్రత్తలు తీసుకుని పెట్టుబడులు పెట్టి సాగు చేస్తే సరైన ధర లేదని రైతులు బాధపడుతున్నారు.

పెట్టుబడి రావడం లేదు..

అన్ని జాగ్రత్తలు తీసుకుని టమాటా పండిస్తే చేతికందే సమయంలో మార్కెట్‌లో ధర లేదు. దీంతో కూలీ, రవాణా డబ్బులు కూడా రావడం లేదు. చాలా మంది రైతులు పంట చేనులోనే వదిలేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మద్దతు ధర కల్పించే విధంగా చూడాలి.

-తిరుపతి రెడ్డి, రైతు మల్లారం

క్లుప్తంగా

జరిమాన, జైలు

డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 30 మంది

సంగారెడ్డి క్రైమ్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి కోర్టు జైలు, జరిమాన విధించినట్లు టౌన్ ట్రాఫిక్ సీఐ సుమన్ కుమార్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. సంగారెడ్డి పట్టణంలో ఆదివారం అర్ధరాత్రి పాత బస్టాండ్, పోతిరెడ్డిపల్లి చౌరస్తా వద్ద డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించాం. ఇందులో 30 మంది వాహనదారులు మద్యం సేవించి పట్టుపడ్డారు. వీరిని సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి మహ్మమద్ షకిల్ ఇద్దరికి జైలు శిక్ష, మిగితా 11 మందికి రూ.2,000, మరో 16 మందికి రూ.1,500, ఒకరికి రూ.1,000 చొప్పన జరిమాన విధించినట్లు పేర్కొన్నారు. నేడు సాయంత్రం సమయంలో పట్టణంలో పలు చోట్ల ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే, పట్టణ టౌన్ సీఐ రమేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాహనాల తనిఖీల్లో ఎనిమిది మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వీరిని సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా ఒక్కొక్కరికి రూ.2,000 జరిమానా విధించారు. పోలీసులతో దురుసుగా ప్రవర్తించిన మరో ముగ్గురికి రూ.450 జరిమాన విధించినట్లు పట్టణ పోలీసులు పేర్కొన్నారు.

సిద్దిపేటలో 16 మంది

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమాన విధించింది. సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో సిబ్బందితో కలిసి ఐదు రోజుల కిందట నిర్వహించిన వాహన తనిఖీల్లో 16 మంది పట్టుబడ్డారు. వారిని సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా సోమవారం విచారణ జరిపిన న్యాయమూర్తి రూ.30,500 జరిమాన విధించినట్లు సీఐ తెలిపారు.

పనికెళ్లిన మహిళ అదృశ్యం


కెతావత్ మని(ఫైల్)

కౌడిపల్లి(నర్సాపూర్): అడ్డా మీద కూలీ పనులకు వెళ్లిన మహిళ అదృశ్యమైంది. సోమవారం ఎస్ఐ రంజిత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని శేరితండాకు చెందిన కెతావత్ మని(36) 28న గుమ్మడిదలకు అడ్డా మీద కూలీ పనులకు వెళ్తుండగా భర్త రాజు బైక్‌పై కౌడిపల్లి బస్టాప్ వరకు తీసుకొచ్చి ఇంటికెళ్లాడు. తిరిగి రాత్రి భార్యను ఇంటికి తీసుకెళ్తేందుకు రాగా ఆమె రాలేదు. అర్ధరాత్రి వరకు వేచి చూసినా రాకపోవడంతో మరుసటి రోజు ఉదయం గుమ్మడిదలతోపాటు బంధువులు, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. భర్త రాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి..


నాగయ్య

రేగోడ్(మెదక్): వ్యక్తి అదృశ్యమైన ఘటన మండలంలోని కొండాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. సోమవారం ఏఎస్ఐ మల్లయ్య తెలిపిన వివరాల ప్రకారం.. కొండాపూర్ గ్రామానికి చెందిన హరిజన్ నాగయ్య(45) 29న మండలంలోని జగిర్యాల గ్రామానికి వెళ్లి వస్తానని ఉదయం 11 గంటలకు ఇంటి నుంచి వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. కుమారుడు హరిజన్ దుర్గాప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ఆచూకీ తెలిస్తే 87126 57926 నంబర్‌కు తెలియజేయాలని ఏఎస్ఐ పేర్కొన్నారు.

బహిర్భూమికి వెళ్లి వృద్ధుడు..


చంద్రయ్య

రామచంద్రాపురం(పటాన్‌చెరు): వృద్ధుడు అదృశ్యమైన ఘటన రామచంద్రాపురం పట్టణంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. వికారాబాద్ జిల్లా బంటారం గ్రామానికి చెందిన చంద్రయ్య హైదరాబాద్‌లోని బాలానగర్ ప్రాంతంలో మనవడు సాయి కుమార్ వద్ద ఉంటున్నాడు. ఆదివారం ఇద్దరూ బంటారం వెళ్లి సాయంత్రం బాలానగర్ బయలుదేరారు. రామచంద్రాపురం పట్టణ పరిధిలోని ఇక్రిశాట్ సమీపంలో మూతపడిన టోల్‌గేట్ వద్దకు రాగానే చంద్రయ్య బహిర్భూమికి వెళ్లాలని కారులో నుంచి దిగాడు. రోడ్డు పక్కన ఆగి ఉన్న వాహనల వెనుకకు వెళ్లి ఎంతసేపైనా తిరిగి రాలేదు. సాయికుమార్ కారులో నుంచి దిగి చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. సోమవారం రామచంద్రాపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వృద్ధుడి కనిపించకుండా వెళ్లినప్పుడు ఒంటిపై లైట్ నీలిరంగు షార్ట్, తెలుపు రంగు పంచ ఉన్నట్లు ఫిర్యాదులో తెలిపారు.

ఆమె చేతికి స్టీరింగ్

మహిళా సంఘాలకు ఎలక్ట్రిక్ వాహనాలు

- శ్రీనిధి, బ్యాంకు లింకేజీ ద్వారా తక్కువ వడ్డీకే రుణాలు
- కాలుష్య రహితంతోపాటు ఉపాధికి మార్గం
- సద్వినియోగం చేసుకోవాలంటున్న అధికారులు

సంగారెడ్డి టౌన్ : కాలుష్యంతో ఎదురవుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. ప్రజల ఆరోగ్యానికి ఇబ్బంది మారింది. వాహనాల నుంచి వెలువడే పొగ కాలుష్యానికి కారణం అవుతోంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఎలక్ట్రిక్ వాహనాల తయారీ, విక్రయాలను ప్రోత్సహిస్తుంది. ఇందులో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లోని మహిళా సంఘాలకు ఎలక్ట్రిక్ వాహనాలను అందించనుంది. ఇందుగాను స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ ద్వారా వారికి తక్కువ వడ్డీకే రుణాలను ఇస్తుంది. దీని వల్ల కాలుష్య రహితంతోపాటు మహిళకు ఉపాధికి మార్గంగా నిలువనుంది.

జిల్లా వ్యాప్తంగా 1,95,010 మంది మహిళా సంఘాల సభ్యులు ఉన్నారు. స్వయం సహాయక సంఘాలు 18,450 ఉండగా గ్రామ సమైక్య సంఘాలు 695, మండల సమైక్య సంఘాలు 25 ఉన్నాయి. మహిళల కోసం స్త్రీనిధి ద్వారా ఎలక్ట్రికల్ వాహనాలను అందుబాటులోకి తీసుకొస్తుంది. ఎలక్ట్రిక్ ఆటోలు, బైకులు వాహనాలు కొనుగోలు చేసేలా తక్కువ వడ్డీకే రుణాలు ఇవ్వనుంది. గ్రామీ ణ ప్రాంతాలకు రవాణా సదుపాయాలు తక్కువగా ఉన్నాయి. స్త్రీనిధి ద్వారా మహిళా సంఘాల సభ్యులకు ఈ ఆటోలో కొనుగోలుకు రుణాలు ఇచ్చే నిర్ణయించడంతో కొంత సమస్య తగ్గించవచ్చన్నారు. దీని ద్వారా ప్రజలకు రవాణా సదుపాయం మెరుగుపడంతో పాటు మహిళలకు గ్రామీణ ప్రాంతాలలో మంచి ఉపాధి లభిస్తుంది. సరుకులు రవాణా చేయడానికి, మహిళలు దూర ప్రాంతాలకు వెళ్లడానికి ఉపయోగకరంగా ఉంటుంది.



వాయిదాల్లో చెల్లింపులు

ఎలక్ట్రికల్ వాహనాల కోసం స్త్రీనిధి ద్వారా రూ.3 లక్షల వరకు రుణాలు ఇస్తారు. 60 నెలలు వాయిదా పద్ధతిలో చెల్లించాల్సి ఉంటుంది. ఎలక్ట్రికల్ ఆటోలో 5 మంది ప్రయాణించవచ్చు. పూర్తిగా ఛార్జింగ్ పెట్టుకోవడంతో 100 కిలోమీటర్ల వరకు ప్రయాణించే అవకాశం ఉంటుంది. దీంతో దగ్గరలోని పాఠశాలకు, వివిధ పనులకు ఉపయోగించుకొని మంచి లాభాలను పొందవచ్చు. ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనం కొనుగోలుకు రూ.75 వేలు రుణాలను అందిస్తారు. 48 వాయిదాల్లో తిరిగి రుణాన్ని చెల్లించాల్సి ఉంటుంది. మహిళా సంఘాల సభ్యులకు గ్రామీణ అభివృద్ధి సంస్థ ద్వారా రుణ సదుపాయం అందజేస్తారు. దీనిని వాడడంతో కాలుష్యాన్ని నివారించొచ్చు. మంచి ఆదాయాన్ని పొందవచ్చు. పెట్రోల్ వంటి ఖర్చులు ఉండకుండా ఉంటుంది.

సద్వినియోగం చేసుకోవాలి



గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు ఉపాధి పొందే విధంగా ఎలక్ట్రికల్ వాహనాల కొనుగోలుకు రుణాలను మహిళా సంఘాల సభ్యులకు అందజేస్తాం. దీనివల్ల గ్రామాల్లో ఉపాధిని పొందవచ్చు. రుణ వాయిదాలను సక్రమంగా చెల్లించాలి. మరింత అవగాహన కలిగి కల్పిస్తాం. మహిళలు సద్వినియోగం చేసుకోవాలి.

–శ్రీనాథ్, శ్రీనిధి మేనేజర్


పట్టుకున్న మద్యం బాటిళ్లు, నిందితులతో ఎక్సైజ్ శాఖ పోలీసులు

గోవా మద్యం బాటిళ్లు స్వాధీనం

- నలుగురు అరెస్టు

జహీరాబాద్ టౌన్: కొత్త సంవత్సరం వేడుకల కోసం గోవా నుంచి తీసుకొస్తున్న మద్యం బాటిళ్లను సోమవారం డీటీఎఫ్, ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. జహీరాబాద్ ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి కథనం మేరకు.. గోవాలో మద్యం తక్కువ ధరలకు లభిస్తుండడంతో నూతన సంవత్సరం వేడుకల్లో పార్టీ చేసుకునేందుకు కొందరు అక్రమంగా తీసుకొస్తున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు 65వ జాతీయ రహదారిపై రాష్ట్ర సరిహద్దులో ఉన్న మాడ్గి చెక్‌పోస్టు వద్ద దుబ్బాక సీఐ శంకర్ ఆధ్వర్యంలో ఎక్సైజ్ పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. జగిత్యాల, సిరిసిల్లాకు చెందిన కృష్ణ, రాం, మారుతీ, అజయ్ ఓ కారులో 64 మద్యం బాటిళ్లు తీసుకొస్తుండగా పట్టుకున్నారు. మరో వ్యక్తి వద్ద 34 బాటిళ్లను పట్టుకున్నారు. వీటి విలువ రూ.1.60 లక్షలు ఉంటుందని, మద్యం బాటిళ్లు, కారుతో పాటు నలుగురిని అరెస్టు చేశామని సీఐ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

మా కాలనీకి రోడ్డు వేయించండి

- కలెక్టరేట్ ఎదుట తిర్మలాపూర్ వాసుల నిరసన

మెదక్ కలెక్టరేట్: ఎస్సీ కాలనీకి రోడ్డు వేయకుండా అడ్డుకుంటున్న వారిపై చర్యలు తీసుకొని వెంటనే తమకు రోడ్డు సౌకర్యం కల్పించాలని పెద్దశంకరంపేట మండలం తిర్మలాపూర్ గ్రామస్తులు కోరారు. సోమవారం మెదక్ సమీకృత కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి అదనపు కలెక్టర్ నగేశ్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం గ్రామస్తులు మాట్లాడుతూ.. ఎస్సీ కాలనీకి వెళ్లే మార్గంలో గ్రామానికి చెందిన నిరుడి సావిత్రి, నిరుడి బాలయ్య రోడ్డు ఆక్రమించి అడ్డంగా రేకు డబ్బాలు ఏర్పాటు చేసి దౌర్జన్యానికి దిగుతున్నారని తెలిపారు. రోడ్డు మాకు చెందుతుందని కాలనీ వాసులపైకి దుర్భాషలాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మా కాలనీకి రోడ్డు సౌకర్యం కల్పించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని 15 కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు. ప్రభుత్వ అంగన్వాడీ కేంద్రానికి కూడా రోడ్డు మార్గం లేకుండా చేశారని తెలిపారు.


కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

పంచాయతీ బోరు.. రైతుల పంట పొలాలకి నీరు


కట్యూర్ గ్రామంలో పైపుల ద్వారా పంట పొలానికి పారిస్తున్న నీరు

- వైకుంఠధామంలో వేసిన బోరు
- తాగునీటి ఇబ్బందుల్లో కట్యూర్ గ్రామస్తులు
- పట్టించుకోని అధికారులు

అక్కన్నపేట(హుస్నాబాద్): ప్రభుత్వం నిధులతో వేయించిన బోరును ఒకరిద్దరూ రైతులు సొంత పంట పొలాలకు నీరును పారిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. అక్కన్నపేట మండలం కట్యూర్ గ్రామ శివారులో గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో రూ.12 లక్షలతో వైకుంఠధాం నిర్మించారు. ఇక్కడ గ్రామ పంచాయతీ నిధులు రూ.లక్ష వరకు వెచ్చించి బోరును వేయించారు. దహన సంస్కారాలకు వచ్చే ప్రజలకు నీటి సౌకర్యం ఉండేలా వేయించారు.ఈ వైకుంఠ ధామం ప్రధాన రహదారి పక్క చాపగానీతండా గ్రామానికి వెళ్లే మార్గంలో ఉంటుంది. చుట్టుపక్కల రైతుల సాగు భూములు ఉన్నాయి. ఇటీవల గ్రామ స్థానిక ఓ కాంగ్రెస్ నాయకుడి ఆదేశాల మేరకు గుట్టుచప్పుడు కాకుండా ప్రభుత్వ బోరుకు మోటారు బిగించుకొని వరి, తదితర పంటలకు నీటిని వాడుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

మరో పక్క తాగునీటికి కష్టాలు..

మరో పక్క గ్రామంలోని ఎస్సీ కాలనీతోపాటు పలు కాలనీల్లో తాగునీరు సరిగ్గా అందక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని పొలాలకు నీరు పారిస్తున్న రైతులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. లేని పక్షంలో జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఎంపీడీఓ భానోతు జయరాం, ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి స్వరూపను సంప్రదించగా వైకుంఠ ధామంలోని ప్రభుత్వ బోరులో మోటారు బిగించుకొని పొలాలకి నీరు పారిస్తున్న విషయం మా దృష్టికి వచ్చింది. బిగించిన మోటార్‌ను తీయించి సదరు రైతులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రాజేశ్వర్‌రెడ్డికి సన్మానం

సిద్దిపేటకమాన్: విజయవాడలో జరిగిన ప్రపంచ తెలుగు రచయితల మహాసభలో సిద్దిపేటకు చెందిన డాక్టర్ రాజేశ్వర్‌రెడ్డి రచించిన వెలుగులు అనే త్రిశతి పద్య పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి బుద్ధ ప్రసాద్, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.


డాక్టర్ రాజేశ్వర్‌రెడ్డిని సన్మానిస్తున్న వక్తలు

ట్రాక్టర్ బోల్తా

కూలీలకు గాయాలు

హుస్నాబాద్‌రూరల్: ట్రాక్టర్ బోల్తా పడి మహిళా కూలీలకు తీవ్రగాయాలైన ఘటన హుస్నాబాద్ మండలం గాంధీనగర్‌లో సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన ఓ రైతుకు వరి నాటు వేసేందుకు కూలీ పనికి వెళ్లారు. పని ముగిశాక సాయంత్రం ట్రాక్టర్ లో గ్రామానికి తిరిగొస్తుండగా శివారులో మలుపు వద్ద వాహనం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రులను హుస్నాబాద్‌లోని ఓ ప్రైవేటు అస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు కరీంనగర్‌కు తరలించారు.

బైక్‌ను ఢీకొట్టిన ఆటో..

పటాన్‌చెరు టౌన్: బైక్‌ను ఆటో ఢీకొట్టిన ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. జీడిమెట్ల సూరారం కాలనీకి చెందిన హితేష్ తెల్లాపూర్‌లో ఓ భవన నిర్మాణ సంస్థలో కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఎప్పటిలాగే ద్విచక్రవాహనంపై పనికి వెళ్తుండగా రామేశ్వరం బండ శివారు సర్వీసు రహదారిపై బైక్‌ను ఆటో ఢీకొట్టింది. దీంతో హితేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. 108 సాయంతో పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

యువకుడి దారుణ హత్య

కంది(సంగారెడ్డి): యువకుడిని గొంతు కోసి దారుణంగా హత్య చేసిన ఘటన కంది మండలంలోని ఉత్తర్‌పల్లి శివారులో చోటు చేసుకొంది. రూరల్ సీఐ క్రాంతి కుమార్ కథనం మేరకు.. సంగారెడ్డిలోని ఎల్‌బీజీ కాలనీకి చెందిన రాజు(34) ఇస్నాపూర్ వద్ద గల ఓ కంపెనీ లోని క్యాంటీన్‌లో పని చేస్తున్నాడు. ఉత్తర్‌పల్లి శివారులో గల ఫ్లిప్ కార్టు కంపెనీ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు రాజు గొంతు కోసి దారుణంగా హత్య చేశారు. సోమవారం ఉదయం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వారి వచ్చి ఘటనా స్థలాన్ని పరిశీలించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. భార్య సుమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఎవరు హత్య చేశారు.. ఎందుకు హత్య చేశారన్న అనే దానిపై దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రైస్ మిల్లులో చోరీ


ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు

కొల్చారం(నర్సాపూర్): రైస్ మిల్లు తాళాలు పగులగొట్టి నగదు చోరీకి పాల్పడిన ఘటన మండలంలోని రాంపూర్ గ్రామ శివారులో సోమవారం ఉదయం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ మహమ్మద్ గౌస్ కథనం మేరకు.. అన్నపూర్ణ రైస్ మిల్లు గేటు తెరిచి ఉండడంతో గ్రామస్తులు మెదక్ పట్టణంలో నివాసం ఉంటున్న మిల్లు యజమాని మల్లేశంకు సమాచారం ఇచ్చారు. అతడు వచ్చి లోపలికి వెళ్లి చూడగా దొంగలు బీరువాలో ఉన్న రూ.50 వేల నగదు ఎత్తుకెళ్లినట్లు గుర్తించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ క్లూస్ టీమ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు. మిల్లు యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

పాఠశాలలో సీసీ కెమెరాలు మాయం

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలం గౌరవెల్లి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో దొంగలు పడ్డారు. ఆదివారం సెలవు దినం కావడంతో గుర్తుతెలియని దుండగులు పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆరు సీసీ కెమెరాలు ఎత్తుకెళ్లారు. అదే విధంగా పాఠశాల పక్కనే ఉన్న రైతు జంగపల్లి రాజవీర్ వ్యవసాయ బావి మోటార్‌ను సైతం దొంగలించినట్లు గ్రామస్తులు చెప్పారు. పాఠశాల ఘటనపై ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు రామన్ బాబు, వ్యాయామ ఉపాధ్యాయులు జంగపల్లి వెంకటనర్సయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం పాఠశాలకు చేరుకొని ఆధారాలు సేకరించారు.

దొంగతనం చేస్తుండగా పట్టుకున్న స్థానికులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెంకట్రావుపేట గేట్ వద్ద గల కిరాణ షాపులో అర్ధరాత్రి చోరీకి పాల్పడుతుండగా స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. సోమవారం స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజిపేట గ్రామానికి చెందిన గుండ వీరేశం వెంకట్రావ్‌పేట గేట్ వద్ద కిరాణా షాపు నడుపుతున్నాడు. రోజుమాదిరిగా ఆదివారం రాత్రి షాపునకు తాళంవేసి ఇంటికి వెళ్లాడు. అర్ధరాత్రి దుకాణంలో నుంచి శబ్దం రావడంతో స్థానికులు గమనించారు. జానకంపేట గ్రామానికి చెందిన ఓ వ్యక్తి చోరీ చేస్తుండగా పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అప్పుల బాధతో యువకుడు ఆత్మహత్య

- అధిక వడ్డీ వేధింపులు తాళలేక ఉరేసుకున్న వైనం
- ఇద్దరిపై కేసు నమోదు


యాదగిరి (ఫైల్)

తూప్రాన్: అప్పులు తీర్చలేక మనస్తాపం చెందిన యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనలో డబ్బుల కోసం వేధింపులకు పాల్పడిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివానందం సోమవారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. పట్టణానికి చెందిన బీజిలిపురం యాదగిరి(36) పట్టణంలోని సర్గల నర్సింలు, సర్గల శ్రీనివాస్‌ల వద్ద చిట్టీలు వేశాడు. డబ్బులు ఎత్తుకొని మళ్లీ వారికి కట్టలేదు. అధిక వడ్డీకి వారి వద్దే అప్పులు చేశాడు. డబ్బులు కట్టాలంటూ ఇచ్చిన వారు నిత్యం వేధించారు. అప్పులు తీర్చలేక యాదగిరి నిత్యం మనోవేదనకు గురయ్యాడు. సోమవారం తన సోదరి ఇంటికి వెళ్లి బాధితుడు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు నర్సింలు, శ్రీనివాస్‌లపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టామని ఎస్ఐ తెలిపారు. కాగా యాదగిరి గతంలో మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన వారి నుంచి అధిక వడ్డీలు, వారి ఇళ్లపై రుణాలు ఇప్పిస్తానని రూ.కోట్లలో రుణాలు పొంది చెల్లించలేని కారణంగా మార్చిలో ఇంటి నుంచి భార్యా ఇద్దరు పిల్లలతో పరారీ అయ్యాడు. బాధితులు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా అప్పట్లో కేసు నమోదైంది. ఈ ఘటన జిల్లాలో కలకలం రేపింది.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురి మృతి


చందుశర్మ (ఫైల్)


కుమార్ సింగ్ (ఫైల్)


ములుగు(గజ్వేల్) : ములుగు మండలంలో ఆదివారం రాత్రి జరిగిన రెండు వేర్వేరు రోడు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరు చికిత్స పొందుతూ మృతి చెందారు. ములుగు ఎస్ఐ విజయ్‌కుమార్ కథనం మేరకు.. బిహార్ రాష్ట్రంలోని పూర్ణియా జిల్లా తనక్ నగర్‌కు చెందిన శివచంద్‌శర్మ(22), మాధేపూరా జిల్లా కరుణానగర్‌కు చెందిన దిల్బర్ కుమార్ సింగ్(29) మూడేళ్లుగా కొత్తూరు గ్రామ సమీపంలోని ఓ సీడ్స్ కంపెనీలో కూలీ పని చేస్తున్నారు. ఆదివారం సాయంత్రం ఇద్దరూ బైక్‌పై కొత్తూరు గ్రామానికి వెళ్లారు. పని ముగించుకొని తిరిగొస్తుండగా సీడ్ కంపెనీ సమీపంలోకి రాగానే డీసీఎం అతివేగంగా వచ్చి ఎదురుగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కుమార్ సింగ్ అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్ర గాయాలైన శివచంద్‌శర్మ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అదే రోజు అర్ధరాత్రి మృతి చెందాడు.

మరో ప్రమాదంలో యువకుడు..

మండలంలోని దండుగూడెం గ్రామ సమీపంలో జరిగిన మరో రోడ్డు ప్రమాదంలో మనోహరాబాద్ మండలం కోనాయిపల్లి(పీటీ) గ్రామానికి చెందిన చెట్టి పృథ్వీరాజ్(24) అక్కడికక్కడే మృతి చెందాడు. కొత్తూరు గ్రామంలోని స్నేహితుడి వద్దకు వెళ్లి వస్తానని చెప్పి సాయంత్రం బైక్‌పై వెళ్లి యువకుడు రాత్రైనా రాకపోవడంతో కుటుంబీకులు ఫోన్ చేశారు. కొద్దిసేపటి తర్వాత వస్తానని చెప్పి రాత్రంతా ఇంటికి రాలేదు. సోమవారం ఉదయం పృథ్వీరాజ్‌కు కుటుంబీకులు మరోసారి ఫోన్ చేయగా వేరే వ్యక్తులు లిఫ్ట్ చేసి దండుగూడెం– కోనాయిపల్లి గ్రామాల మధ్య మట్టి రోడుపై చనిపోయి ఉన్నాడని తెలిపారు. కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి వెళ్లి చూడగా మృతి చెంది ఉన్నాడు. మృతిపై కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనలపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.


పృథ్వీరాజ్ (ఫైల్)

ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి..


లింగం(ఫైల్)

దుబ్బాకరూరల్: ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని రామక్కపేట గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ గంగరాజ్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన అలుమాల లింగం(48) 29న ఉదయం పొలం వద్ద ఒడ్డు చెక్కడానికి ఇంట్లో చెప్పి వెళ్లాడు. సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. భార్య చంద్రకళ పొలం వద్దకు వెళ్లి చూడగా చెప్పులు కనిపించాయి. పొలం పక్కన ఉన్న బావిలో పడి ఉన్నాడు. బావిలో నీళ్లు ఉండడంతో అప్పటికే మృతి చెందాడు. ఆమె అరుపులు విని చుట్టుపక్కల వారు వచ్చి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

దైవదర్శనానికి వెళ్తుండగా..

- విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు
- దంపతులు, ఇద్దరు కూతుళ్లకు తీవ్ర గాయాలు
- ఆస్పత్రికి తరలిస్తుండగా మహిళ మృతి


ప్రమాదంలో దెబ్బతిన్న కారు

కొల్చారం(నర్సాపూర్): కారు అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన ప్రమాదంలో మహిళ మృతి చెందారు. ఎస్ఐ మహమ్మద్ గౌస్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ షేక్ పేట సీతానగర్‌కు చెందిన బోగి చంద్రకాంత్ నవ్య శ్రీ చారి(28) దంపతులు ఇద్దరు కూతుళ్లు తన్వి శ్రీ, సహస్రతో కలిసి సోమవారం ఉదయం కారులో ఏడుపాయల వనదుర్గాదేవి దర్శనానికి బయలుదేరారు. మెదక్– నర్సాపూర్ జాతీయ రహదారిపై వెళ్తుండగా అప్పాజీపల్లి గ్రామ శివారులోని ప్రాథమిక పాఠశాల మలుపు వద్దకు రాగానే కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 వాహనంలో మెదక్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నవ్య శ్రీ చారి పరిస్థితి విషమంగా మారడంతో వైద్యుల సూచనల మేరకు హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయింది. భర్త, ఇద్దరు కూతుళ్ల హైదరాబాద్‌లోనే ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చెరువులో పడి ఒకరు.. పురుగు మందు తాగి మరొకరు

– ఒకే గ్రామంలో ఇద్దరు మృతి


స్వామి (ఫైల్)


శ్రీకాంత్ (ఫైల్)

రామాయంపేట(మెదక్): ప్రమాదవశాత్తు చెరువులో పడి ఒకరు.. కుటుంబ సమస్యలతో క్రిమి సంహారక మందు తాగి మరొకరు మృతి చెందారు. ఒకే గ్రామంలో ఇద్దరు యువకులు మృతి చెందడంతో తీవ్ర విషాదం నెలకొంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని ప్రగతి ధర్మారం గ్రామంలో వారం రోజుల కిందట ఒకరు మృతి చెందగా నక్కని స్వామి (23) కుటుంబ సభ్యులతో కలిసి దశదిన కర్మ కార్యక్రమానికి వెళ్లాడు. ఇందులో భాగంగా స్నానం చేయడానికి చెరువులోకి దిగారు. కుటుంబ సభ్యులు, బంధువులు చూస్తుండగానే స్వామి మునిగిపోయాడు. రక్షించడానికి ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. గజ ఈతగాళ్లు రప్పించి మృతదేహాన్ని బయటకు తీశారు. మరో ఘటనలో గ్రామానికి చెందిన అక్కమెల్ల శ్రీకాంత్ యాదవ్ (25) కుటుంబ సమస్యలతో నాలుగు రోజుల కిందట క్రిమి సంహారక మందు తాగాడు. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఇద్దరు యువకుల మృతితో గ్రామంలో విషాదం నెలకొంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.